విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసుల పాత్ర కీలకం

విశాలాంధ్ర-తాళ్లూరు : గ్రామాలలో శాంతి భద్రతలు కాపాడడంలో మహిళా పోలీసులపాత్ర కీలకమైందని స్థానిక ఎస్సై బీ ప్రేమ్ కుమార్ అన్నారు. పోలీస్ స్టేషన్ లో సోమవారం మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా పోలీసులు గ్రామంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. బాల్య వివాహాలను నిరోధించడం, వివాదాలు ఉత్పన్నం కాకుండా చూడడం బాధ్యతల్లో అంతర్భాగమేనని ఆయన తెలిపారు.

మానంవారి పుష్పాలంకరణ వేడుకల్లో దారపనేని

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : మానం గిరి, నాగలక్ష్మి దంపతుల కుమార్తె తులసి గాయత్రి పుష్పాలంకరణ వేడుకలు విజయవాడలోని ముత్యాలం పాడు గోకరాజు గంగరాజు కళ్యాణ మండపంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కనిగిరి ఏఎంసి మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ తులసి గాయత్రిని ఆశీర్వదించి చిన్నారికి శుభాకాంక్షలు తెలియజేశారు. మానం వెంగయ్య, గద్ద గూటి వేమయ్య, బోట్ల నాగార్జున, నాగేశ్వరరావు,తిరగల దీన్నె మల్లెబోయిన బాల బ్రహ్మం పాల్గొన్నారు.

జ్వాలాముఖి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలోని బొద్దికూరపాడు జ్వాలాముఖి దేవాలయంలో సోమవారం అమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాన్ని, అమ్మవారి మూల విరాట్‌ను అందంగా అలంకరించారు. గ్రామానికి చెందిన మాధవస్వామి దేవాలయ ట్రస్ట్ చైర్మన్ పులి అంజిరెడ్డి భార్య వెంకటరత్నం అమ్మవారికి సింహపు వాహనాన్ని, గ్రామానికి చెందిన అమెరికన్ పబ్లిక్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ పులి వెంకటేశ్వరరెడ్డి భార్య శిరీష జ్వాలాముఖి అమ్మవారికి త్రిశూలం బహుకరించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం ప్రత్యేక హెూమాలు నిర్వహించడం జరుగుతుందని పూజారులు, నిర్వాహకులు తెలిపారు.

గార్లదిన్నె వీఆర్ఏ మృతి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : గార్లదిన్నె వీఆర్ఏగా పనిచేస్తున్న ఈర్ల గురవయ్య (58) సోమవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడికి భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. మరణ వార్త తెలుసుకున్న తహసీల్దార్ ప్రసాదరావు ... గురవయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢసానుభూతిని తెలిపారు. మట్టి ఖర్చులు నిమిత్తం పదివేల రూపాయలను గురవయ్య భార్యకు అందజేశారు. వీఆర్వోలు రాజశేఖర్, లక్ష్మిరెడ్డి, శ్రీకాంత్ వీఆర్ఏ రాజశేఖర్ ఉన్నారు.

25న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బి విజయ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కే రాఘవేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ ఎంపీటీసీలు సర్పంచులు అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

చదువులో రాణించాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : విద్యార్థులు చదువులో రాణిస్తే భవిష్యత్తులో మంచి ఫలితాలు పొందవచ్చని ఎస్సై బి ప్రేమ కుమార్ అన్నారు. ఊటుకూరు కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల 45వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ, బాల బాలికలు కళాశాల చదువు సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పదవ తరగతి వరకు తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉంటారని, కళాశాల నుండి మానవ జీవితానికి తొలిమెట్టు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. తప్పటడుగులు వేయకుండా క్రమశిక్షణతో రాణించి ఉన్నత విద్యతోపాటు, ఉన్నత ఉద్యోగాలను పొందాలని ఆయన తెలిపారు. ఆటలు, చదువులో ముందంజలో ఉన్నవారికి బహుమతి ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు జీతాలు చెల్లించండి

విశాలాంధ్ర-పీసీపల్లి : స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయిపడిన జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ కనిగిరి నియోజకవర్గ అధ్యక్షులు గుజ్జల బాలిరెడ్డి డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్మికులు ధర్నా నిర్వహించారు. గుజ్జల మాట్లాడుతూ, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.6 వేల నుంచి రూ. పదివేకు జీతం పెంచాలని డిమాండ్ చేశారు. పని భద్రత కల్పించి రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.53 లక్షలు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి ఆదాయం రూ.1,53,618 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్ర నారాయణ రెడ్డి సోమవారం తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.50,030, లడ్డు ప్రసాదంద్వారా రూ.25,155, అన్నదానానికి విరాళం ద్వారా రూ.57,317, మహా ప్రాకార నిర్మాణానికి విరాళం ద్వారా రూ.5,116, ఇతర విరాళాలు రూ.16వేలు వచ్చినట్లు వివరించారు. బెంగుళూరు వాస్తవ్యులు రుద్రరాజు ప్రవీణ్ వర్మ సతీమణి దీపిక అన్నదానానికి రూ.10,116 ఇచ్చినట్లు ఈఓ తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, పాలకమండలి మెంబర్ మంచికంటి మధుసూదన్ తదితరులు ఉన్నారు.

క్షుద్రపూజల పుకార్లతో గ్రామస్థులు గజగజ



విశాలాంధ్ర-త్రిపురాంతకం : మండల కేంద్రంలో క్షుద్ర పూజలు జరిగాయని పుకార్లు షికార్లు చేయడంతో గ్రామస్థులు గజగజలాడుతున్నారు. ఎస్సీ శ్మశాన వాటిక సమీపంలో క్షుద్రపూజలు జరిగిన ఆనవాలు కనిపిస్తున్నాయి. కుంకుమ, నిమ్మకాయలు, మట్టి ప్రమిదలు, దిండు, ముగ్గుతో వేసిన మనిషి ఆకారం, వీటి చుట్టూ అనేక రంగులతో కలిసినదారం వున్నాయి. అటువైపు పొలాలకు వెళ్ళే రైతులు వెళ్తే ఎక్కడ తమ ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందోనని భయకంపితులౌతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఇలాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. పోలీసులు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలి

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 13 నుంచ 17వ తేదీ వరకు జిల్లాలోని అన్ని బ్యాంకుల ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఆర్థిక ప్రణాళిక-ఆర్థిక ప్రవర్తన ఉండాలని, బడ్జెటింగ్ మరియు పొదుపు, డిజిటల్ ఫైనాన్స్ సర్వీసెస్.... ఈ మూడు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అందరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండి కుటుంబ అభివృద్ధికి తోడ్పడేవిధంగా మంచి బ్యాంకింగ్ విధానాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకుని ఆన్‌లైన్ మోసాలకు చెక్ పెట్టాలన్నారు. అవగాహన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కే యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ , జిల్లాలో ఉన్న అన్ని బ్యాంకులు తమతమ బ్రాంచీల ద్వారా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు చేపట్టి ప్రజలందరికీ అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగడం, ఆర్థిక క్రమశిక్షణ అలవాట్లు, బ్యాంకుల నుంచి రుణం తీసుకోవటం ... ఆ రుణాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. చాలా బ్యాంకుల కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు. తొలుత గోడ పత్రికను కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయండి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను ఈ నెల 15 నాటికి క్లియర్ చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సోమవారం ప్రకాశం భవనంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు గురికాకుండా పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ప్రచారం, ఎన్నికల కోడ్ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయడానికి కలెక్టరేట్‌లో 1077 నెంబరుతో కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఒంగోలు డివిజన్‌లో 8, మార్కాపురం డివిజన్‌లో 3, కనిగిరి డివిజన్‌లో 1 చొప్పున అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉన్నందున వారిని త్వరగా గుర్తించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల సమాగ్రి, వాటి రవాణా, వెబ్ క్యాస్టింగ్ తదితర విషయాలలో కూడా సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జేసీ ఎం అభిషిక్త్ కిషోర్, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్డీవో సందీప్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా పాల్గొన్నారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి

విశాలాంధ్ర- తాళ్లూరు : కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి చేపట్టిన పీఎం కిసాన్ పథకం లబ్ధి చేకూరాలంటే రైతులు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో బి ప్రసాద్‌రావు అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం 1లో సోమవారం ఆయన ఈకేవైసీ చేస్తున్న వైనాన్ని పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం 13వ విడత పీఎం కిసాన్ లబ్ధి నగదును జమ చేయడం జరుగుతుందని దీని నుండి లబ్ధి చేకూరాలంటే రైతులు తప్పనిసరిగా ఈనెల 15 లోగా ఈ కేవైసీ పూర్తి చేయించుకోవాలని ఆయన తెలిపారు.

రైతు భరోసా కేంద్రాల్లో ఈ కేవైసీ నిర్వహించబడుతుందని, రైతులు తమ సెల్‌ఫోన్‌లో స్వయంగా ఈకేవైసీ చేయించుకోవచ్చని ఆయన సూచించారు. కొందరి రైతుల ఆధార్ అనుసంధానం కాకపోవడం వల్ల కూడా లబ్ధి చేకూరడంలో విఫలమవుతున్నారని తెలిపారు. ఖాతా లేనివారు పోస్ట్ ఆఫీస్‌లో అయినా ఖాతా ప్రారంభించాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు నాగరాజు నాయక్, సుధీర్, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

విశాలాంధ్ర-హనుమంతునిపాడు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌గా చక్క రామకృష్ణ, కో-కన్వీనర్లుగా కస్తాల బాలయ్య, నాగూర్ మీర, సానికొమ్ము రమణారెడ్డి, కత్తి అజయ్, కత్తి డేవిడ్, సిహెచ్ రాములను కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు సోమవారం ఎంపీపీ గాయం సావిత్రి నియమించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ , వైసీపీ పార్టీ ప్రతిష్టతకు తోడ్పడతామని, పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎంపాడు ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి , తిమ్మారెడ్డిపల్లి వైసీపీ ఇంచార్జ్ కస్తాల బాలాజీ, మండల మహిళా అధ్యక్షురాలు కస్తాల బేబీ వారిని అభినందించారు. కార్యకర్తలంతా ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్‌ను మరలా గెలిపించాలన్నారు.

మోటార్ సైకిల్ దొంగ అరెస్ట్



విశాలాంధ్ర, శింగరాయకొండ : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని మూలగుంటపాడు అమరావతి రోడ్ లో ఈ నెల 9న మోటార్ సైకిల్ గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మొహమ్మద్ ఫిరోజా ఫాతిమా కేసు నమోదు చేశారు. సిఐ డి రంగనాథ్ పర్యవేక్షణలో ఎస్ఐ దర్యాప్తు చేపట్టి మోటార్ సైకిల్ దొంగని అదుపులోకి తీసుకున్నారు. కావలి రైల్వే స్టేషన్ వద్ద మోటార్ సైకిల్ ను స్వాధీన పరుచుకుని నిందితుడిని రిమాండ్ నిమిత్తం కందుకూరు కోర్టులో హాజరు పరిచారు. నిందితుడు కరణం ప్రసాద్‌ది నెల్లూరు జిల్లా ఆత్మకూర్ మండలం వాసవి గ్రామం. భార్యపై అలిగి మద్యానికి అలవాటు పడి నేరాలకు అలవాటు పడినట్టు ఎస్సై తెలిపారు.

తూము పునరుద్ధరించండి

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రంలోని టంగుటూరు నుండి పాకల, రాయరుపాలెం, పసుపు కుదురు, వెలగపూడి వెళ్లే రహదారి మధ్యలో దాదాపు 5 నెలల క్రితం తూము విరిగిపోయింది. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సిబ్బంది తూమును పునరుద్ధరించి వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం: టీడీపీ

విశాలాంధ్ర-పామూరు : టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ కాజా రహంతుల్లా ఆధ్వర్యంలో పామూరులో సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు , మాజీ జెడ్పిటిసి బొల్ల మాల్యాద్రి చౌదరి మాట్లాడుతూ , రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, భద్రత లేని రాష్ట్రంలో బతుకుతున్నామన్నారు. అరాచక పాలన అంతం కావాలంటే ప్రజల్లో చైతన్యం రావాలని, రాబోయే ఎన్నికల్లో వైసిపి పాలనకు చరమగీతం పాడి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకు రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో తిరుగుతూ కండువలు కప్పడం ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్‌కు తగదన్నారు. సయ్యద్ అమీర్ బాబు, మన్నం రమణయ్య, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, యారవ ప్రసాద్‌రెడ్డి, షేక్ గౌస్ బాషా, కోటిరెడ్డి, రమాదేవి, షేక్ ఖాదర్ భాష తదితరులు పాల్గొన్నారు.

సేవలన్నీ సచివాలయంలోనే జరగాలి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : మండలంలోని వెల్లంపల్లి సచివాలయాన్ని ఎంపీడీవో మరియదాస్ సందర్శించారు. సేవలు, రిజిస్టర్లు, హాజరుపట్టీని పరిశీలించారు. సేవలన్నీ గ్రామ సచివాలయం పరిధిలోనే జరగాలని సూచించారు. ఎవరైనా చట్ట విరుద్ధం విధులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీనియర్ అసిస్టెంట్ రంగారెడ్డి, సచివాలయ సిబ్బంది దేవరాజ్ వున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ సంపత్ కుమార్ సోమవారం తెలిపారు. పసుపుగల్లు గ్రామానికి చెందిన బాలిక దర్శిలోని కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆదివారం సెలవు కావడంతో ముళ్ళమూరులోని కస్తూర్బా పాఠశాల వద్దకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిందని చీకటి పడిన ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు బంధువులు కుటుంబ సభ్యులు ఇళ్ల వద్దకు వెళ్లి విచారించినా కనిపించక పోవడం లేదని నిర్ధారణకు వచ్చి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎల్ సంపత్ కుమార్ తెలిపారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర-ముండ్లమూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం యుటిఎఫ్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మాజీ అధ్యక్షులు పణిదపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి దనిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా పి తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దార్ల శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా సుభాని, సహాధ్యక్షురాలిగా ఝాన్సీ రాణి, కోశాధికారిగా ఓగేటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టి రాజశేఖర్, గోగుల కోటేశ్వరరావు, ముద్దపాటి శ్రీనివాసరావు, దార్ల శ్రీనివాసరావు, బాచిన పూరచంద్రరావు, ఏ తిరుపతిరెడ్డి, కే కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో
శ్రీచైతన్య విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర, శింగరాయకొండ: నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలలోని అండర్ -14 విభాగంలో స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి కే ఆనంద్ సత్తా చాటాడు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థి అభినంద సభలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ సూర్యరావు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక వికాసం తో పాటు శారీరక వికాసం కూడా కలిగి ఉండాలి అని అన్నారు. అన్ని రంగాలలో విద్యార్థులు ముందుకు దూసుకుపోయేందుకు శ్రీ చైతన్య విద్యాసంస్థలు అన్ని విధాల కృషి చేస్తాయని అన్నారు. అకాడమిక్ శ్రీనివాస్, ఏవో మధు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వేణు వంశి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ సుబ్బారావు విద్యార్థిని అభినందించారు.

చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యేను కలిసిన డీఈవో

విశాలాంధ్ర-చీమకుర్తి : జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని సోమవారం చీమకుర్తిలోని వారి స్వగృహంలో జిల్లా విద్యాశాఖ అధికారిగా భాధ్యతలు చేపట్టిన పి.రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత

విశాలాంధ్ర- మార్కాపురం టౌన్ : పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో నివసిస్తున్న మండ్ల పకీరయ్య కుటుంబానికి సోమవారం హోంగార్డు చెన్నుపల్లి కాశయ్య ఆధ్వర్యంలో కాసుల ప్రవీణ్ కుమార్ ఆర్థిక సహకారంతో బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేశారు. పక్షవాతంతో బాధపడుతున్న పకీరయ్య దాత ప్రవీణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. తమ కుమారునికి సాయమందిస్తే చదువు కొనసాగిస్తానని పకీరయ్య భార్య వెంకటమ్మ విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9603580633 సంప్రదించాలని హోంగార్డు కోరారు.

కొమరోలులో కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-కొమరోలు : శాంతిరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆరవీటి ఫౌండేషన్ శ్రీనివాస ప్రజా వైద్యశాల, పోలేపల్లి పెద్ద రంగయ్య సహాయ సహకారాలతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని కొమరోలులో సోమవారం నిర్వహించారు. పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా హాజరయ్యారు. కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరం ఉన్నవారిని నంద్యాలలో ఉచితంగా ఆపరేషన్ చేస్తామని వైద్యులు ఈ సందర్భంగా తెలిపారు. వైద్యులు వైద్య సిబ్బంది ఆది, కేశవ్, మూర్తి పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలకల్పన చంద్రబాబుకే సాధ్యం

విశాలాంధ్ర-యద్దనపూడి : టీడీపీ బలోపేతానికి యువత ముందుకు రావాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. చింతపల్లిపాడుకు చెందిన యువత సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత అన్ని రంగాల్లో రాణించాలని, కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలివెళ్లిపో వడంతో యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోవడం జరుగుతుందని అన్నారు. ఉద్యోగ అవకాశాలు రావాలన్న, రాష్ట్రానికి కొత్త కంపెనీలు తీసుకురావాలన్న అది ఒక్క చంద్రబాబు నాయుడుకే సాధ్యమని పేర్కొన్నారు. ఏ నాగాంజనేయులు, ఎం వెంకట్ సాయి, రావుల భవాని శంకర్, వెంకటకృష్ణ చైతన్య, జంపని గోపి, తేజ పాల్గొన్నారు.

22 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

విశాలాంధ్ర-చీమకుర్తి : పట్టణంలోని రామ్ నగర్ ఒకటవ లైన్ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వైసీపీ నాయకులు ఏఎంసీ మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి రూ.25 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. కమిటీ సభ్యులు రాముడు సుబ్బారావు, పొదిలి రాములు, వ్యాసాల వెంకటేశ్వర్లు, పోతు శివ నాగరాజు, ఫణి కుమార్ కసుమూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి మాజీ శాసన సభ్యులు ఇరిగినేని తిరుపతి నాయుడు 6వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకులు దేవరపు మాల్యాద్రి సహకారంతో అన్నదానం చేశారు. మోపాడు కు చెందిన టీడీపీ బీసీ సెల్ గ్రామ అధ్యక్షులు ఖాజా మస్తాన్, దారపనేని నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మనోహర్ జన్మదినోత్సవం

విశాలాంధ్ర-పామూరు : మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ జన్మదిన వేడుకలను వైసీపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మనోహర్ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. మండల అధ్యక్షులు గంగాసాని హుసేన్‌రెడ్డి,ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్... మనోహరును పూల కిరీటంతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. షేక్ కాజా నాయబ్ రసూల్, చప్పిడి సుబ్బయ్య, దర్శి రాము, గట్ల విజయభాస్కర్ రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, చల్లా సుబ్బారావు, జొన్నలగడ్డ గోవిందయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, రసూల్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. వైద్యాధికారిణి వీ జ్యోతి, ఎం జాస్మిన్ మాట్లాడుతూ విద్యార్థినిలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. జలుబుల, దగ్గు, జ్వరం ఉన్నట్లయితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రభుత్వం 104 వాహనం ద్వారా గ్రామాలలో డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ వద్ద ఏర్పాటు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని వైద్యాధికారి బి మధు శంకర్ అన్నారు. మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోలవరంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాల ద్వారా టెస్టులు నిర్వహించి నాణ్యమైన మందులు అందిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన డాక్టర్లచే వైద్య సేవలు అందించడం జరుగుతుంది అన్నారు. గ్రామీణ ప్రజలు ఈ శిబిరాల్లో వైద్య సేవలు పొందాలన్నారు. 140 మందికి వైద్య పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్ కే యం యం సుభాని, సీహెచ్ఓ శరణ్య, ఏఎన్ఎం సుమతి, 104 డిఇఓ వెంకట ప్రసాద్, శ్రీలత, రజిని, రూత్ మేరీ తదితరులు పాల్గొన్నారు.

రథం నిర్మాణానికి రూ.2 లక్షలు విరాళం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : దర్శి శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం నూతన రథోత్సవం మరియు మహా శివరాత్రి మహోత్సవం కార్యక్రమం సందర్భంగా స్వామి వారి అమ్మవారి నూతన రథం నిర్మాణం కొరకు రూ.2 లక్షలు విరాళంను ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం తన నివాసంలో రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు మరియు శిద్దా సుధీర్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నారాపుశెట్టి శివ ప్రసాద్, గోసుల నాగేశ్వరి, గుడిపల్లి నాగలక్ష్మి, మెడ వెంకట నాగేశ్వరరావు, శానం వెంకట్రావ్,భక్తులు పాల్గొన్నారు.

తప్పుడు రాతలు రాసినా నిజాల్ని చెరపలేరు: టీడీపీ

- జగన్ క్రూరత్వం ప్రజలకు తెలిసిపోయింది!
- 'జగనాసుర రక్త చరిత్ర బహిరంగం' పుస్తకావిష్కరణలో నేతల ధ్వజం

ఒంగోలులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : 'జగనాసుర రక్త చరిత్ర' పుస్తకాన్ని సోమవారం టీడీపీ నియోజకవర్గ ముఖ్య నాయకులు విడుదల చేశారు. వివేకా హత్య కేసులో పూర్వాపరాలను సమగ్రంగా వివరిస్తూ 'జగనాసుర రక్త చరిత్ర బహిరంగం' పేరుతో ప్రచురించిన పుస్తకాన్ని ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ ఆదేశాల మేరకు టీడీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. వివేకా హత్యపై టీడీపీ విడుదల చేసిన జగనాసుర రక్త చరిత్ర పుస్తకంతో జగన్ క్రూరత్వం ప్రజలకు తెలిసిపోయింది. అందుకే గత నాలుగు రోజుల నుంచి తాడేపల్లి ప్యాలెస్ కంపించిపోతోంది. వివేకా హత్య కేసులో సూత్రధారి తాడేపల్లి ప్యాలెస్‌లో ఉంటే ప్రధాన పాత్రదారులు ఎంపీ అవినాష్ రెడ్డి, అతని కుటుంబసభ్యులు. జగన్ ఇన్నాళ్లు ఆస్కార్‌కి మించి నటించారు... ఇప్పుడు ప్రజలకు వాస్తవాలు తెలియటంతో పిచ్చి కుక్కల్ని మీడియా ముందుకు వదిలారు... ఎన్ని కుక్కల్ని వదలినా, సాక్షిలో ఎన్ని తప్పుడు రాతలు రాసినా నిజాల్ని చెరపలేరు... అవినాష్‌రెడ్డిని సీబీఐ విచారించటంతో వివేకా హత్యలో తాడేపల్లి గుట్టు అంతా బయటపడింది... ఇంకా అవినాష్‌రెడ్డి అమాయకుడన్నట్టు వైసీపీ నేతల చేత జగన్ మాట్లాడించటం సిగ్గుచేటు... అవినాష్‌రెడ్డికి సంబంధం లేకపోతే హత్యలో ప్రధాన నిందితులు శివశంకర్‌రెడ్డి, ఈసీ సురేంద్రనాథ్ రెడ్డి, ఇతర వ్యక్తుల్ని తీసుకుని స్వయంగా డీజీపీ సవాంగ్ దగ్గరకు ఎందుకు వెళ్లాడు? అవినాష్ రెడ్డి తండ్రి వైయస్ భాస్కర్‌రెడ్డి నేడు ఎక్కడ దాక్కున్నాడు? సీబీఐకి ఎందుకు ముఖం చాటేశాడు. సీబీఐ విచారణలో అవినాష్ రెడ్డి నోటి వెంట కృష్ణమోహన్‌రెడ్డి, నవీన్ పేర్లు రాకుంటే సీబీఐ వారికి నోటీసులు ఎందుకు ఇస్తుంది? గతంలో నవీన్ ఎవరో బయటకు ప్రపంచానికి తెలుసా? హత్య జరిగాక చంద్రబాబు సీఎంగా 75 రోజులున్నా చార్జ్‌షీట్ ఎందుకు వేయలేకపోయారని వైసీపీ నేతలంటున్నారు... కానీ జగన్ ముఖ్యమంత్రి అయ్యి 415 రోజులైనా చార్జ్‌షీట్ ఎందుకు వేయలేదు? వివేకా హత్య సమాచారం ప్రతి నిమిషం అవినాష్‌రెడ్డికి తెలుసు, అర్ధరాత్రి తన అనుచరులకు, తాడేపల్లి ప్యాలెస్ టచ్‌లో ఉండి ఈ కిరాతకానికి ఒడిగట్టారు... వివేకానందరెడ్డి హత్యపై అన్ని ఆధారాలతో టీడీపీ విడుదల చేసిన జగనాసుర రక్తచరిత్ర పుస్తకం ద్వారా ప్రజలకు జగన్ క్రూరత్వం తెలిసిపోయిందని, అందుకే నిన్నటి నుంచి తాడేపల్లి ప్యాలెస్ కంపించిపోతోందని ఒంగోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరావు,షైక్ కపిల్ బాషా, పసుమర్తి హఘయ్యరాజు, బండారు మదన్, బోడేపూడి శివప్రసాద్, పూసపాటి జాలిరెడ్డి పాల్గొన్నారు.

జగన్ ఉక్కిరిబిక్కిరి

గిద్దలూరులో...

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ టీడీపీ నాయకులు జగనాసుర రక్తచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సొంత బాబాయిని చంపిన కేసులో నిందితులను ఇప్పటికి పట్టులేకపోవటం జగన్ హస్తం ఉండటమే దీనికి కారణం అని, నాడు ఎంపీ సీటు కోసం బాబాయిని అడ్డు తొలగించుకున్నారని దానిని మొదట గుండెపోటుగా చిత్రీకరించి, తర్వాత గొడ్డలిపోటుగా తేలిందని ధ్వజమెత్తారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ మోహన్‌రెడ్డి, అతని సోదరుడు అవినాష్‌రెడ్డి కలిసి బాబాయిని హతమార్చారని, అయితే నాడు ఆ నేరాన్ని అధికారంలో ఉన్న తెలుగుదేశం పై నెట్టి తన సాక్షి పత్రికల్లో పిచ్చి రాతలు రాశారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం బాబాయి హంతకులను ఎందుకు పట్టుకోలేక పోయిందొ సమాధానం చెప్పాలన్నారు.

వివేకా కుమార్తె సునీతమ్మ న్యాయం చేయమని జగన్ ను కోరితే ఎందుకు సహకరించలేదో,తండ్రి హత్యలో జగన్‌కు పాత్ర ఉందని తెలుసుకున్న సునీత రాష్ట్రపతిని, సుప్రీంకోర్టును సంప్రదించగా ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించారని, ఇటీవల సీబీఐ కేసు విచారణ వేగవంతం చేసిందని, అందులో భాగంగానే ఎంపీ అవినాష్‌రెడ్డిని విచారణ చేసిందని అన్నారు. ఈ విచారణలో బాబాయిని మట్టుపెట్టింది సొంత కుటుంబ సభ్యులేనని రాష్ట్ర ప్రజలంతా తెలుసుకున్నారని, నాడు బాబాయికి న్యాయం చేయాలనీ కోరిన జగన్ నేడు నిజం బయట పడటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడని, కేసుల నుండి తప్పించుకోవటానికి కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు.

వివేకా హత్య కేసులో తాడేపల్లి ప్యాలెసు ప్రధాన పోషించిందని సీబీఐ విచారణలో తేటతెల్లం అవుతుందని ఈ జగనాసుర రక్త చరిత్రలో సొంత బాబాయితో పాటు రాష్ట్రంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పటికైనా సీబీఐ వివేకా కేసులో విచారణను వేగవంతం చేసి నిందితులను శిక్షించాలని గిద్దలూరు తెలుగుదేశం పార్టీ తరపున డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ పెద్ద మస్తాన్, రాష్ట్ర టి.ఎన్. టీ.యూ.సి కార్యదర్శి షేక్ మదార్ వలి, 2వ వార్డు కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్,7వ వార్డు కౌన్సిలర్ బిల్లా రమేష్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పందీటి రజిని బాబు,పట్టణ మైనారిటీ అధ్యక్షుడు ఆదాం ఖాన్,నియోజకవర్గ టి.ఎన్.టీ.యూ.సి. అధ్యక్షుడు ఉలావు బాల చెన్నయ్య,రైతు అధ్యక్షుడు ఎలిశెట్టి వెంకటప్ప, మాజీ కౌన్సిలర్ మండ్లా శ్రీనివాసులు, సీనియర్ నాయకులు బాలనరసయ్య, బీసీ నాయకులు చింతలపూడి బాలరాజు,చిలకల రమణ, వడ్లమాని సుబ్బరాయుడు,తెలుగు యువత సభ్యులు గిద్దలూరు మద్దిలేటి, సుండి వెంకటరమణ, గువ్వల రంగనాయకులు, సొంటం కళ్యాణ్‌రెడ్డి, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి దూదేకుల దస్తగిరి, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి గర్రె సాయినాథ్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు మూల వెంకటరామిరెడ్డి, టీ.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షులు బొర్రా రాఘవేంద్ర యాదవ్, పార్లమెంట్ కార్యదర్శి ఎం.వి.సాయి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై పోక్సో కేసు నమోదు చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : బాల్య వివాహాలు జరిగితే తక్షణమే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బాల్య దశలోనే వివాహాలు చేసుకుని గర్భిణీలైన వారితో సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల జీవితాలను నాశనం చేసే బాల్య వివాహాలను నిర్మూలించాలని చెప్పారు. బాల్య వివాహాలను సమూలంగా అరికట్టడానికి అధికారులు సమన్వయంతో కృషిచేయాలని ఆదేశించారు. బాలికల హక్కులు పరిరక్షి ంచాల్సిన బాధ్యత మహిళాశిశు సంక్షేమశాఖ అధికారు లదేనన్నారు. సమాజానికి మేలుచేయడం మానేస్తే బాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. కౌమార దశలోని కిశోర బాలికలు గర్భిణీలుగా మారడంతో రక్తహీనత, పోషణ లోపానికి గురౌతున్నారని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. అత్యంత ప్రమాదకర స్థాయిలో వారి ఆరోగ్యపరిస్థితి ఉండడంపై ఆరాతీశారు. అధికారులు, అంగన్వాడి కార్యకర్తలు, ఏ.ఎన్.ఎమ్.లు, మహిళా పోలీసులు పర్యవేక్షణ లేకపోవడంతోనే కౌమా రదశ బాలికలు ప్రమాదం అంచులో ఉన్నారని తెలిపారు. బాల్య వివాహాలకు డ్రాప్ అవుట్స్ మరో కారణమని ఆమె చెప్పారు. అధికారులు, సిబ్బంది చేతగాని తనం బాలికల భవిష్యత్తు నిర్వీర్యం అవుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాలో బాల్యదశలోనే గర్భిణీలుగా నమోదైన 30 సచివాలయాల పరిధిలోని అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయకపోతే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసు కుంటామని మందలించారు. 43 కేజీల బరువున్న 13 ఏళ్ల బాలిక గర్భిణీగా ఉండడం, 16 ఏళ్ల వయస్సున్న మరో బాలిక గర్భం దాల్చడంపై కలెక్టర్ తీవ్రంగా స్పం దించారు. బాల్య వివాహాలు జరుగుతుంటే సంబంధిత ప్రాంతంలోని సచివాలయాల సిబ్బంది నమోదు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితులను చూసి అధికారులు సిగ్గుపడాల న్నారు. నూతన జిల్లాగా ఆవిర్భవించిన ఏప్రెల్-4వ తేదీ నుంచి జిల్లాలో జరిగిన వివాహాలపై సర్వే చేయాల న్నారు. వివాహాలు చేసుకున్న వారి ఆధార్ కార్డులను పరిశీలించి ఆన్‌లైన్లో పక్కాగా నమోదు చేయాలని సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. బాల్య దశలో గర్భిణీలైన వారి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా సంబంధిత సి.డి.పి.ఓ.లకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళాశిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పనితీరు బాగోలేదని ఆమె తీవ్రంగా అసంతృప్తి వ్యక్తంచేశారు. కాగితాలపై లెక్కలు చూపడం మాని క్షేత్రస్థాయిలో వాస్తవికతను నమోదు చేయాలని ఆమె పలు సూచనలు చేశారు. సమాజంలో మార్పువచ్చేలా వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏ.ఎన్.ఎమ్.లు ప్రజలను చైతన్య పరచాలన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ పి.డి. కె. ఉమ, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ విజయమ్మ, సి.పి.ఓ. జి. భరత్, డి.ఎల్.డి.ఓ.లు, ఐ.సి.డి.ఎస్. సి.డి.పి.ఓ.లు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏ.ఎన్.ఎమ్.లు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే వివేకా హత్య: టీడీపీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మాజీ ఎంపీ వివేకానంద రెడ్డి హత్య మొత్తం తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే జరిగిందని అర్థం అవుతుంది, కావున సీబీఐ, కోర్టులు నిష్పక్షపాతంగా వ్యవహరించి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని లేని పక్షంలో నరహంతకులు విచ్చలవిడిగా రెచ్చిపోతారని పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. స్థానిక పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో జగనాసుర రక్తచరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి సోషల్ మీడియాలో జగనసుర రక్తచరిత్ర బహిర్గతం అనే బుక్ హల్చల్ చేస్తోందని, ఆ బుక్‌లో వివేకానంద రెడ్డి హత్య గురుంచి పూర్తి వివరాలు ఉన్నాయి. నాడు ఆ హత్య జరిగిన సమయంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక డ్రామాలు ఆడి, ఆ నెపం టీడీపీ మీద నెట్టి రాజకీయంగా బాగా లబ్ది పొందారు. స్వయంగా వివేకానంద రెడ్డి కూతురు, జగన్మోహన్ రెడ్డి చెల్లె ఈ ప్రభుత్వం మీద నమ్మకం లేదని ఆ కేస్‌ను ప్రక్క రాష్ట్రనికి బదిలీ చేయాలని కోరారంటేనే నిందితులను కాపాడటానికి ఈ ప్రభుత్వం ఎంతగా కృషి చేస్తోందో అర్థం అవుతోందని అన్నారు. తాడేపల్లి ప్యాలస్ పక్కన జరిగిన యువతి హత్య జగన్ పాలనా వైఫల్యానికి నిదర్శనమని, తాడేపల్లి కేంద్రంగానే గంజాయి, డ్రగ్స్ వినియోగం జరుగుతుంది అని, మాదక ద్రవ్యాలకు యువత బానిసలు అవ్వటం వల్లే హత్యలు, అత్యాచారాలు పెరిగాయి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, టీడీపీ నాయకులు లాల్ వజీర్, మానం శ్రీను, కురంగి శ్రీను, గుడిపాటి రమేష్, ఉప్పుటూరి పేరయ్య, ఆదం షా, షాహిద్ బాబు, కన్నసాని బాజీ, లామ్ నవమి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌ఆదాలత్‌లో 4143 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర - బాపట్ల : ఈ నెల 11వ తేదీన జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లాలో 4143 కేసులు పరిష్కారం జరిగాయని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కేసుల సత్వర పరిష్కారానికి చక్కని వేదిక జాతీయ మెగా లోక్ అదాలత్ అన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా పోలీస్ అధికారులు విచారణ దశలో ఉన్న కేసులు, కోర్టులో ట్రయిల్ పెండింగ్ ఉన్న కేసులలో కక్షిదారులు మధ్య రాజీ కుదిర్చి, కొన్ని కేసులలో ముద్దాయిలకు అపరాధ రుసుముతో 838 క్రిమినల్ కేసులు, 3304 పెట్టీ కేసులతో కలిపి 4143 కేసులను పరిష్కారం జరిగాయన్నారు. సిబ్బంది ప్రణాళికబద్ధంగా ముందు నుంచి లోక్‌అదాలత్‌లో రాజీ చేయదగిన కేసులలోని కక్షిదారులకు నోటీసులు జారీచేసి ఇరుపక్షల వారికి కౌన్సిలింగ్ నిర్వహించి సమస్యను పరిష్కరించి స్నేహపూర్వక వాతావరణం తీసుకువచ్చి జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. నిరంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో క్రిమినల్ కేసులు, కుటుంబ కలహాలు, భార్య భర్తల గొడవలు, రోడ్డు ప్రమాదలు, ట్రాఫిక్ కేసులు కేసులలోని ఇరుపక్షాల కక్షిదారులు కేసులను కోర్టలలో పరిష్కరించుకోవడనికి ఎక్కువ కాలపరిమితి పడుతుంటుందన్నారు. ఈ నేపధ్యంలో అలాంటి కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకుంటే బాధితులకు సకాలంలో సత్వర న్యాయం చేకూరుతుందన్నారు. పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికలు నిర్వహణకు మూడు అదనపు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో జిల్లాలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ నియోజకవర్గ స్థాయిలో ఎన్నికలు నిర్వహించడానికి 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1400 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాల్లో అదనంగా మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేశారన్నారు. చీరాల మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి మరో రెండు పోలింగ్ కేంద్రాలను వేటపాలెం మండలంలో మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపనున్నట్లు కలెక్టర్ చెప్పారు.జేసీ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీ శివ జ్యోతి, ఎన్నికల సూపరింటెండెంట్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అమూల్యకు గోల్డ్ మెడల్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మైసూర్ జేఎస్ ఎస్ మెడికల్ కళాశాల నుంచి న్యూరాలజీ స్పెషాలిటీలో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా స్థానిక గుంటూరువారి తోటలోని ఆదిత్య హాస్పిటల్స్‌లో ఆదిత్య హాస్పిటల్స్ అధినేత, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ పాకనాటి కృష్ణస్రవంత్, స్టాప్‌మెంబర్స్ డాక్టర్ అమూల్యను సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు. సత్కారం అనంతరం డాక్టర్ అమూల్య మాట్లాడుతూ ఎంతో కష్టమైన న్యూరాలజీ విభాగం నుంచి మైసూర్ జేఎస్ఎస్ మెడికల్ కళాశాల వారు గోల్డ్ మెడల్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆదిత్య హాస్పిటల్‌లో న్యూరాలజీతో పాటు అన్ని విభాగాలలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తారని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు, చుట్టు పక్క ప్రాంతాల ప్రజలకు కూడా సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కృష్ణ స్రవంత్, డాక్టర్ అమూల్యలు వెల్లడించారు. పలువురు వైద్యులు ఫిట్స్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా ఫిట్స్‌కి గురయ్యే అవకాశాలు ఉంటాయ న్నారు. సకాలంలో వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవడం ద్వారా ఫిట్స్ నుంచి త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు.

హామీలన్నీ నెరవేర్చాలి: ఎంపీ

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్ర రాష్ట్రాన్ని విభజించే సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గత 9 ఏళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నాం.. హామీలను నెర వేర్చకుండా కేంద్రం తాత్సారం చేస్తూనే ఉందని పార్ల మెంట్‌లో కేంద్రాన్ని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు నిలదీ శారు. రైల్వే విషయంలో కేంద్రం ఇచ్చిన హామీల్లో.. సౌత్‌కోస్ట్ రైల్వే జోన్ నిర్మించలేదు, కనీసం ఒక్క బిల్డింగ్ కట్టిన పరిస్థితి లేదని అన్నారు. ఏపీ యువత ఉద్యోగాల ఎంపిక కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.. కేంద్రం ఇచ్చిన హామీ మేరకు వైజాగ్‌లో రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త రైల్వే లైన్ల నిర్మాణ ఒప్పందాలు 2014కి ముందే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంతో చేసుకుంది.. కానీ అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే నిర్మాణాలకు రాష్ట్రం స్థలాలు కేటాయించలేదని సాకులు చెబుతున్నారన్నారు. స్థలం ఇచ్చి అన్ని ఒప్పం దాలు రాష్ట్రం పూర్తి చేసుకుంది. కానీ నిధుల విషయంలో రాష్ట్రం ఇబ్బందిపడుతోంది. 2014కి ముందు రాష్ట్ర ఆదాయం బాగా ఉండేది.. విభజన తర్వాత రాష్ట్రంలో రెవెన్యూలోటు ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఒప్పందాలు సడలించి రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించా లన్నారు. రైల్వే వ్యవస్థను కేంద్రం బిజినెస్‌గా కాకుండా.. సర్వీస్‌గా చూడాలని సూచించారు. కొవిడ్‌కు ముందు చాలా స్టేషన్‌లో రైళు ఆగేవి.. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. ఉదాహరణకు పల్నాడు జిల్లాలో పిడుగురాళ్ల విషయానికొస్తే.. గతంలో 17 రైళ్లు ఆగేవి, ఇప్పుడు 7 రైళ్లు ఆగుతున్నాయి. ప్రజలు చాలా ఇబ్బంది పడుతు న్నారు. అన్ని స్టేషన్లలో రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దూకుడు పెంచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి

విశాలాంధ్ర - చీరాల : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మొదటి ప్రాధాన్యత ఓటును వేసి ఆశీర్వదించాలని తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నీలం శ్యాముల్ మోజెస్ అన్నారు. చీరాలలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. తూర్పు రాయలసీమ నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం,నెల్లూరు,చిత్తూరు జిల్లాల అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి పెద్దల సభకు వెళ్లే అవకాశం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల,ప్రభుత్వ ఉద్యోగుల, పట్టభద్రుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసికొనివెళ్లి పరిష్కరించే విధంగా పోరాటం చేస్తానని అన్నారు.

ముగిసిన నాగార్జున వర్సిటీ క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో గత కొన్ని రోజుల నుంచి జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో చోడవరం ఆర్. వి.ఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కళాశాల జట్టు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కళాశాల జట్టుపై 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో సత్తెనపల్లి ప్రగతి డిగ్రీ కాలేజ్ ఏఎన్‌యూ సీపీఈఈఎస్ జట్లు పోటీపడగా ప్రగతి డిగ్రీ కళశాల జట్టు విజయం సాధించి మూడోస్థానం కైవసం చేసుకుంది. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, వైస్‌ప్రెసిడెంట్ దొప్పలపూడి రామ్మోహన్, ప్రిన్సిపాల్ ఎస్.కె. నజీర్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అంకమ్మచౌదరి, పి.గౌరీశంకర్, సెల్ సెలక్షన్ కమిటీ మెంబర్స్, పాతూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిబ్బంది యోగక్షేమాలకు ప్రాధాన్యం

విశాలాంధ్ర - బాపట్ల : సాయుధ పోలీసు బలగాల లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వ హించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదే శాల మేరకు పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిష్ణాతులైన వైద్య బృందంచే 121 మంది సాయుధ పోలీసు సిబ్బందికి షుగర్, బిపి, హృదయ సంబంధిత సమస్యలకు, కంటి సమస్యలకు, దంత సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుత్తూ సాయుధ పోలీసు బలగాలకు ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకు నేందుకు దోహదం చేసే మొబలైజేషన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ శాఖలో సాయుధ పోలీసు బలగాలు అత్యంత క్రియాశీల కమైన బాధ్యత వహిస్తాయ న్నారు. సాయుధ బలగాలు పోలీస్ శాఖకు భుజాలు లాంటివని పోలీస్ ఉద్యోగం అంటే ఏ క్షణంలో ఏ బందోబస్తు వస్తుందో తెలియదని, క్షణం తీరికలేని విధులు సమయాభావం లేని ఆహారపు అలవాట్లు, నిద్రలేమి కారణాల వలన సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి చూపించలేకపోతున్నారని తెలిపారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

EP 431/2018 ARC 181/2015
M/s. Shriram City Union Finance Ltd., Chirala Branch
Rep. by It's Divisional Executive & GPA holder Ongole Division, Prakasam (Dt.) .. D.H.
Vs
Jeedi Nagarjuna and '3' others - JDR's

2nd J.Dr. యొక్క ఆస్తుల వేలం ప్రకటన
పై నెంబరు గల E.P లో D.Hr E.P. బాకీని వసూలు నిమిత్తం E.P. షెడ్యూలు దాఖల స్థిరాస్తిని వేలమునకు తెచ్చియున్నారు. సదరు వేలం శ్రీ కోర్టు వారి ఎదుట తేది.09.03.2023న ఉదయం గం.10.30ని.లకు వేలం పాట జరుగును. కావున సదరు కోర్టులో జరుగు బహిరంగ వేలంలో యావన్మంది వేలంపాటలో పాల్గొని పాట పాడుకోవలసినదిగా పైకోర్టు వారి ఉత్తర్వుల మేరకు తెలియజేయడమైనది.

షెడ్యూలు :
ప్రకాశం జిల్లా, పొదిలి సబ్ రిజిస్ట్రేషన్, పొదిలి(మండలం),పొదిలి గ్రామంలో గల సర్వే నెం.858/1, 857/2, 857/3లలో ప్లాట్ నెం.9, 236 చ॥గుల ఖాళీ స్థలంకు హద్దులు : తూర్పు : 20 అడుగుల వెడల్పు రాస్తా, దక్షిణం : అమ్మినవారి యొక్క మిగులు స్థలం మరియు షేక్ మస్తాన్ బీబీస్ యొక్క ప్లాట్ నెం.8 & 7ల స్థలం, పడమర : ఇరిగేషన్ కాలువ, ఉత్తరం : అమ్మినవారి యొక్క ప్లాట్ నెం.10 ఖాళీస్థలం.

D.Hr. Value : Rs.13,76,353-00
SRO Market Value : Rs.16,87,400-00
అమీనా విలువ : రూ.14,00,000-00
వేలం వాయిదా : తేది : 09.03.2023
ఫర్దర్ హియరింగ్ తేది : 16.03.2023
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
స్థలం : మార్కాపురం తేది : 13.02.2023

జటప్రోలు సుబ్బరామకృష్ణ శాస్త్రి, B.Sc., LLB
D.Hr. తరుపు అడ్వకేటు
మార్కాపురం-523316. సెల్ : 98854 56270

మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఈపీ. 15/2019 ఇన్ ఓ.యస్ నెం : 16/2017
బిట్వీన్ :
మద్దెల వెంకట సత్య రమేష్ - డీ.హెచ్.ఆర్
వర్సెస్
పార్లపల్లి మురళి - జె.డీ.ఆర్

వేలం ప్రకటన : పై నెంబరు ఈ.పీ. 15/2019 షెడ్యూల్ అస్తులను డీ.హెచ్.ఆర్ బాకీ రాబట్టు నిమిత్తము ఘనమైన కోర్టులో తేది: 01-03-2023న ఉదయం 10.30లకు బహిరంగ వేలం వేయుటకు కోర్టు వారు నిర్ణయించడమైనది ఇందుమూలముగా బహిరంగ వేలములో పాల్గొనదలచిన వారు పాల్గొనవచ్చును.

షెడ్యూల్ : ఐటెమ్ : 1 ప్రకాశం జిల్లా, మార్కాపురం సబ్‌రిజిస్ట్రేషన్ మరియు మండలం మార్కాపురం మున్సిపాలిటీలోని 1వ వార్డు శ్రీ లక్ష్మీ చైన్నకేశవ నగర్, ఎస్ నెం : 486/1 నియర్ డోర్ నెం :1-203-ఎ-25 ఖాళీ స్థలము 1577.8 Sq yard లోని 1/6వ వంతు మరియు కొంత కన్‌స్ట్రక్షన్ హద్దులు
తూర్పు : పేరూరి శ్రీనివాసులు గారి ఖాళీ స్థలం **దక్షిణం :** బొందిలి బాలప్రసాద్ సింగ్ వగైరాల ఖాళీ స్థలం **పడమర :** షేక్ మహమ్మద్ షరీఫ్ గారి ఖాళీస్థలం **ఉత్తరం :** 30 అడుగుల రస్తా
డిహెచ్‌ఆర్ విలువ : 3,50,000/-
అమీనా విలువ : 8,00,000/-
మార్కెట్ విలువ : 7,36,288/-

ఐటెమ్ :2 ప్రకాశం జిల్లా, మార్కాపురం సబ్‌రిజిస్ట్రేషన్ మరియు మండలం మార్కాపురం మున్సిపాలిటీ 1వ వార్డు ఎస్.ఎన్. బృందావనం అపార్ట్‌మెంట్‌లోని 2బిహెచ్‌కె ఫ్లాట్ నెం : 401 1214 Sq feet అపార్ట్‌మెంట్ హక్కుల తోటి
డిహెచ్‌ఆర్ విలువ : 8,00,000/-
అమీనా విలువ : 30,00,000/-
మార్కెట్ విలువ : 19,24,100/-

ఐటెమ్ :3 ప్రకాశం జిల్లా, పొదిలి సబ్ రిజిస్ట్రేషన్ తర్లుపాడు గ్రామం మండలం ఎస్ .నెం 262/2, 2వ వార్డులోని ఇల్లు, ఇంటి నెం : 2/48, 108.3 Sq yard **హద్దులు : తూర్పు :** బజారు **దక్షిణం :** మాదాల వీర బ్రహ్మయ్య గారి ఖాళీస్థలం **పడమర :** పార్లపల్లి సుధాకర్‌రావు గారి ఇల్లు **ఉత్తరం :** బజారు
డిహెచ్‌ఆర్ విలువ : 3,50,000/-
అమీనా విలువ : 6,00,000/-
మార్కెట్ విలువ : 7,16,808/-
వేలం తేది : 01-03-2023
తదుపరి వాయిదా 09-03-2023

రాళ్ళబండి శ్రీకృష్ణయ్య,
పైడిమర్రి రామచంద్ర
అడ్వకేట్స్, మార్కాపురం